క్లుప్తంగా

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న యువకులు

ఆత్మకూరు: ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 50 మందికిపైగా యువకులు ఈ శిబిరంలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. పలువురు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆరోగ్య వంతమైన వారు ఏడాదిలో నాలుగు మార్లు రక్తదానం చేయవచ్చునన్నారు. ఈకార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం, ఆర్ఎంఓ డాక్టర్ ఉషాసుందరి, నెల్లూరు అపోలో డయాలసిస్ విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాటర్ కూలర్లు వితరణ



వాటర్ కూలర్లు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి

కలిగిరి: కలిగిరి పొగాకు వేలం కేంద్రానికి పాలూరు మాలకొండారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండు వాటర్ కూలర్లను బుధవారం అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి మాట్లాడుతూ వేసవిలో పొగాకు రైతులకు చల్లని తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో తమ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వాటర్ కూలర్లను అందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు పాలూరు కొండారెడ్డి, వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి చెంచు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ సమష్టి బాధ్యత



ఆత్మకూరు ఇంజినీరింగ్ కళాశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థినులు

ఆత్మకూరు: పర్యావరణ పరిరక్షణ కోసం, వాతావరణం సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పెంచి పెద్ద చేయాలని ఆత్మకూరు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ కిషోర్‌రెడ్డి అన్నారు. కళాశాలలో బుధవారం 2, 3వ సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటించారు. ఆయన మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్ నివారణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎంఎల్ హెచ్‌ఓడీ సుదర్శన్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



వైఎస్సార్‌సీపీలో చేరిన కార్యకర్తలను స్వాగతిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి

బిట్రగుంట: బోగోలు మండలం విశ్వనాథరావుపేట మేజర్ పంచాయతీలో భారీ స్థాయిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. టీడీపీ నేత విశ్వనాథరావుపేట మాజీ సర్పంచ్ దేవరకొండ భాస్కర్, మాజీ వార్డు సభ్యులు పిట్టు మధు, సత్యం, మల్లికార్జున, డబ్బేరు సుధీర్, వరుణ్ ఆధ్వర్యంలో పలువురు టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన టీడీపీ నాయకులు, కార్యకర్తలను కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ విజయదుందుభి మోగించడం ఖాయమన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు కులమతాలకు అతీతంగా ఊరూవాడా ఏకమవుతున్నాయని తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, మండల యువత అధ్యక్షుడు మేకల శ్రీనివాసులు, నాయకులు పాశం రవీంద్రబాబు, తుమ్మల రమణయ్యానాయుడు, సుందర్‌రాజు, షమీ, శేఖర్, నిర్మల్, తిరుపతి, పాపయ్య, బొంతా సుధీర్, వార్డు సభ్యులు పద్మావతి పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజారోహణ

అల్లూరు: అల్లూరుపేటలో కొలువైన కామాక్షిదేవి సమేత సిద్ధేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఉదయం వేద పండితులు శాస్త్రోక్తంగా ధ్వజారోహణం, చప్పర ఉత్సవం నిర్వహించారు.

ఆదుకున్న ఆరోగ్యశ్రీ

ఉదారంగా.. సీఎం సహాయ నిధి

- ఏడాదిన్నర వ్యవధిలో 94 మందికి రూ.1.83 కోట్లు సాయం
- ఆరోగ్యశ్రీ పరిధిలోకి 3707 వ్యాధులకు ఉచితంగా చికిత్స
- రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు వైద్య ఖర్చులు పెంపు
- ఆరోగ్యశ్రీ వర్తించని వైద్య ఖర్చుల కింద సీఎం సహాయ నిధి సాయం



సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి (ఫైల్)



ఆత్మకూరు: వైద్యం పేదోడికి ఖరీదైంది. కొన్ని రకాల వ్యాధులకు చికిత్స చేయించుకునేందుకు ఆయా కుటుంబాలు తీవ్ర ఆర్థికంగా కుంగిపోయాయి. వైద్యం చేయించుకోలేక కొందరు కుటుంబ సభ్యులు కళ్ల ముందు కాలం చేసిన ఉదంతాలు ఆ కుటుంబాలను మానసికంగా దెబ్బతీశాయి. మరికొన్ని కుటుంబాలు ఉన్న ఆస్తులు పోగొట్టుకుని రోడ్డున పడ్డాయి. ఈ పరిస్థితిని గుర్తించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి దేశంలోనే తొలిసారిగా ఉమ్మడి రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ ప్రవేశపెట్టారు. వెయ్యికి పైగా వ్యాధులను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెచ్చారు. దశల వారీగా 2,500 వ్యాధులకు పెంచుకుంటూ వచ్చారు. అర్హతలు ఉన్న వారికి లక్షలాది రూపాయలు వైద్యం ఉచితంగా అందుబాటులోకి వచ్చింది.

చంద్రబాబు హయాంలో..

దివంగత డాక్టర్ వైఎస్సార్ ప్రారంభించిన ఆరోగ్య పథకం దేశానికి ఆదర్శంగా నిలిచి, పేదోళ్లు కార్పొరేట్ వైద్యశాలల్లో ఉచితంగా వైద్య సేవలు పొందుతున్నారు. 2014లో అధికారంలోకి చంద్రబాబు ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ వచ్చారు. ప్రధానంగా అత్యంత ఖరీదైన వైద్య సేవలను ఆరోగ్యశ్రీ నుంచి తొలగించారు. ఇలా క్లిష్టమైన వైద్య సేవలన్నీ దశల వారీగా తగ్గించుకుంటూ రావడంతో చివరికి 600 పై చిలుకు వ్యాధులకు మాత్రమే ఆరోగ్యశ్రీని వర్తింప చేశారు. కార్పొరేట్ వైద్యశాలలకు ఆరోగ్యశ్రీ బిల్లులు నిలిపివేశాడు. టీడీపీ ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న వైద్యశాలల్లో చికిత్స పొందిన వారి బిల్లులు మాత్రమే అందించారు. సీఎం సహాయనిధిని కూడా అరకొర మందికే ఇచ్చారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చాక వైద్యానికి పెద్దపీట వేసి ఆరోగ్య శ్రీ పథకానికి జీవం పోశారు. ప్రారంభంలోనే 2434 వ్యాధులకు వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టారు. ఆ తర్వాత మరికొన్ని వైద్య సేవలను పెంచుకుంటూ ఆరోగ్యశ్రీ పరిధికి 3707 రకాల వ్యాధులకు వర్తించేలా చేశారు. ఆరోగ్యశ్రీ కింద రూ.5 లక్షల వరకు ఉన్న ఆర్థిక సాయాన్ని ఏకంగా రూ.25 లక్షలు వైద్యం ఆరోగ్య శ్రీ కార్డు ద్వారా అందేలా చర్యలు చేపట్టారు. అయితే ఈ నేపథ్యంలో ఆరోగ్యశ్రీకార్డు పలు కారణాలతో వర్తించని వారికి సీఎం సహాయనిధి అందజేయడం పరిపాటి. అయితే రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఆపత్కాలంలో ముఖ్యమంత్రి సహాయనిధి గత ప్రభుత్వం కంటే ఉదారంగా పలువురు రోగులను ఆదుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేవు.

రికార్డు స్థాయిలో సీఎం సహాయనిధి

ఆత్మకూరు నియోజకవర్గంలో పలువురికి ఆరోగ్యశ్రీ వర్తించకపోవడం వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రమే కావడంతో పలువురు బాధితులు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ద్వారా సీఎం సహాయ నిధిని కోరారు. ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి చొరవ తీసుకుని నియోజక వర్గంలో ఏడాదిన్నర కాలంలో రికార్డు స్థాయిలో 94 మందికి రూ.1,83,22,000 ఆర్థిక సాయం అందేలా చేయూతనిచ్చారు. కొందరికి ఖరీదైన ఆపరేషన్లు చేయించుకునేందుకు ముందస్తుగానే ఎల్‌ఓసీ సైతం లక్షలాది రూపాయల చెక్కులు అందుకోవడంతో వారు ఆజన్మాంతం సీఎం జగనన్నకు రుణపడి ఉంటామని తెలుపుతున్నారు. జిల్లాలో మరే నియోజకవర్గంలోనూ ఈ స్థాయిలో బాధితులకు సీఎం సహాయనిధి అందలేదు. విపత్కర పరిస్థితుల్లో తమ ఇంటికి పెద్ద దిక్కులా ఎమ్మెల్యే చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి సాయం అందజేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

సహాయనిధి ఆదుకుంది



నాకు వెన్నుపూస సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాను. ఆరోగ్య సమస్యతో ఇంటిలో పని కూడా చేయలేను. పలువురు డాక్టర్లకు చూపితే మెరుగైన చికిత్స కోసం చెన్నైకి వెళ్లాలన్నారు. అప్పు చేసి చెన్నైలోని ఆస్పత్రిలో వెన్ను పూస శస్త్ర చికిత్స చేయించుకున్నాను. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కావడంతో ఎమ్మెల్యే ద్వారా సాయం కోరడం జరిగింది. ఆయన చొరవతో సీఎం సహాయనిధి అందింది. అప్పులు తీర్చేశాము. ఇద్దరికి రుణపడి ఉంటాము.

– బత్తిన లక్ష్మీసుజాత, ఆత్మకూరు

కష్టకాలంలో ఆదుకున్నారు



కష్టకాలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఆదుకుంది. అప్పు చేసి చెన్నైలో చికిత్స (గాల్‌బ్లాడర్ స్టోన్ సర్జరీ) చేయించుకున్నాను. ఆరోగ్యశ్రీ మాకు వర్తించదు. దీంతో అప్పు చేయాల్సి వచ్చింది. అయితే ఎమ్మెల్యే విక్రమన్న చొరవతో సీఎం సహాయనిధి అందించారు. అది ఆదుకుంది. కష్ట కాలంలో ఆర్థిక సాయం అందేలా చేసిన ఎమ్మెల్యేకు, ముఖ్యమంత్రి జగనన్నకు రుణపడి ఉంటా.

– మెట్ట సునీత, ఆత్మకూరు

సీఎంకు కృతజ్ఞతలు



ఈ చిత్రంలో కనిపిస్తున్న చిట్టమూరు గోపాల్ రెడ్డిది ఆత్మకూరు పట్టణమే. షుగర్ వ్యాధితో కాలికి తగిలిన చిన్నపాటి గాయం పెరిగి పెద్దదైంది. దీంతో ఇన్‌ఫెక్షన్ శోకి గత నెలలో చెన్నైలో ఆపరేషన్ చేసి కాలు తొలగించారు. వీరి ఆర్థిక పరిస్థితి గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి చొరవతో సీఎం సహాయనిధి నుంచి రూ.3 లక్షలు మంజూరు చేయించారు. వారి కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రికి, ఎమ్మెల్యేకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

– చిట్టమూరు గోపాల్ రెడ్డి, ఆత్మకూరు

విజయసాయిరెడ్డికి అపూర్వ ఆత్మీయ స్వాగతం



ఎంపీ విజయసాయిరెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి, బీద మస్తాన్‌రావు, మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, మన్నెమాల సుకుమార్‌రెడ్డి



ఆత్మకూరు: ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డితో పార్టీ నాయకులు

- వేలాదిగా తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలు
- భారీగా కార్ల ర్యాలీతో హోరెత్తిన కావలి

కావలి: నెల్లూరు పార్లమెంట్ సమన్వయకర్తగా నియమితులై తొలిసారిగా నెల్లూరుకు రోడ్డు మార్గంలో విచ్చేసిన రాజ్యసభ సభ్యుడు వేణుంబాక విజయసాయిరెడ్డికి కావలి నియోజకవర్గ పార్టీ శ్రేణులు అపూర్వ స్వాగతం పలికారు. కావలి మండలం చెన్నాయపాళెం రోడ్డు వద్దకు చేరుకునే సరికి కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అభిమానులతో కలిసి విజయసాయిరెడ్డికి, ఆయనతో పాటు ఉన్న రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావుకు ఘన స్వాగతం పలికారు. భారీ గజమాలలు, శాలువాలతో సత్కరించి జై జగన్ నినాదాలతో హోరెత్తించారు. అక్కడి నుంచి కావలి పట్టణం మీదుగా భారీ సంఖ్యలో కార్ల ర్యాలీ బయలుదేరింది. కనీవినీ చూడని రీతిలో భారీగా కావలి పట్టణంలోకి ప్రవేశించిన కార్ల ర్యాలీ పట్టణ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. అభిమానులు, కార్యకర్తలతో పాటు స్థానిక యువత, చిరు వ్యాపారులు కార్ల కాన్వాయ్ పట్టణాన్ని దాటే వరకూ జైజగన్ నినాదాలతో సందడి చేశారు. అనంతరం దగదర్తి మండలం ఉలవపాళ్ల కూడలి వద్ద మేకపాటి విక్రమ్‌రెడ్డి కార్యకర్తలు, అభిమానులతో స్వాగతం పలికి ఎంపీలు విజయసాయిరెడ్డి, బీద మస్తాన్‌రావులను ఘనంగా సత్కరించారు. అప్పటికే ఉలవపాళ్ల కూడలికి చేరుకున్న అల్లూరు, దగదర్తి మండలాల అభిమానులతో కలిసి ఎంపీ విజయసాయిరెడ్డి కాన్వాయ్ నెల్లూరు బయలుదేరింది.

కరేడు ర్యాంప్ వద్ద కనీవినీ ఎరుగని స్వాగతం

ఎంపీ విజయసాయిరెడ్డికి కరేడు ర్యాంప్ వద్ద పార్టీ కందుకూరు సమన్వయకర్త బుర్రా మధుసూదన్ యాదవ్, కందుకూరు ఎన్నికల పరిశీలకులు మన్నెమాల సుకుమార్ రెడ్డి గజమాలలతో స్వాగతం పలికారు. భారీ క్రేన్ సాయంతో గజమాలలతో స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. అక్కడి నుంచి భారీ కార్ల కాన్వాయ్, వేలాదిగా తరలివచ్చిన అభిమానులతో నెల్లూరుకు బయలుదేరారు.

ప్రత్యేక వాహనాల్లో తరలిన ఆత్మకూరు నాయకులు

ఆత్మకూరు: నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి విజయసాయిరెడ్డికి ఘన స్వాగతం పలికేందుకు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సారథ్యంలో వందలాది వాహనాల్లో ఆత్మకూరు నుంచి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, పార్టీ రాష్ట్ర నాయకులు బుధవారం తరలివెళ్లారు. తొలిసారి ఆయన నెల్లూరుకు వస్తున్న క్రమంలో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి దగదర్తి మండలం ఉలవపాళ్ల వద్ద జాతీయ రహదారిపై ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకట రమణమ్మ, వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, పార్టీ నాయకులు డాక్టర్ ప్రణీత్, ఐవీ రమణారెడ్డి, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, బాల అంకయ్య, జమ్రు, కె కిషోర్, తోడేటి మణి, పలువురు కౌన్సిలర్లు, తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

పొగాకు వేలం ప్రారంభం



కలిగిరి: వేలం నిర్వహిస్తున్న అధికారులు



మర్రిపాడు: పొగాకు వేలం నిర్వహిస్తున్న దృశ్యం

- కిలో గరిష్ట ధర రూ. 231

కలిగిరి: కలిగిరి కేంద్రంలో బుధవారం పొగాకు వేలం ప్రారంభమయ్యింది. ఉదయం వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ రైతులతో కలిసి వేలం కేంద్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైతులు సంగినంగా తీసుకువచ్చిన 18 పొగాకు బేళ్లకు వేలం నిర్వహించారు. కిలో పొగాకు రూ. 250తో వేలం ప్రారంభించారు. ఆ ధరతో కంపెనీల ప్రతినిధులు కొనుగోలుకు ముందుకు రాకపోవడంతో తగ్గిస్తూ వచ్చారు. కిలో పొగాకు గరిష్ట ధర రూ. 231, కనిష్ట ధర రూ. 230 లభించింది. 18 బేళ్లను కొనుగోలు చేశారు. 11 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొన్నారు.

రూ.230 ధర పలికిన కిలో పొగాకు

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో బుధవారం వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ ఆధ్వర్యంలో విక్రయాలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు వేలానికి 18 బేళ్లు రాగా 18 బేళ్లను విక్రయించారు. కిలో పొగాకు రూ.230 గరిష్ఠ ధర లభించింది. వేలంలో 2409 కిలోల పొగాకు అమ్ముడు కాగా రూ.5,54,093 వ్యాపారం జరిగింది. తొలి రోజు వేలంలో 12 కంపెనీలు పాల్గొన్నాయి.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



లక్ష్మీపురంలో హెల్త్‌క్లినిక్ సెంటర్ ప్రారంభోత్సవంలో మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

కలిగిరి: రాష్ట్రంలో కులమతాలు, పార్టీలకు అతీతంగా ఎటువంటి లంచాలకు తావులేకుండా అర్హులైన ప్రతి కుటుంబానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందజేశారని ఉదయగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి చెప్పారు. లక్ష్మీపురం పంచాయతీలో బుధవారం ప్రజా సంకల్ప యాత్ర నిర్వహించారు. స్థానికులు సమన్వయకర్త మేకపాటికి అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీ మేదరమెట్ల వద్ద సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న 'సిద్ధం' సభలో మేనిఫెస్టో విడుదల చేయనున్నారన్నారు. సీఎం జగన్‌ను మేనిఫెస్టోలో పొందుపరచిన అన్ని పథకాలను అమలు చేస్తారనే ప్రగాఢ నమ్మకం ప్రజల్లో ఉందన్నారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకుంటే రానున్న రోజుల్లో ఇంతకంటే మెరుగైన పాలన అందిస్తారన్నారు. ప్రతిపక్షాలు చెప్పే కల్లబొల్లి మాటలు ప్రజలు విశ్వసించే పరిస్థితిలో లేరన్నారు. రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, విజయసాయిరెడ్డిని ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ప్రజల ముంగిటకే సేవలు

గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్ల ఏర్పాటుతో గ్రామాలలో ప్రజల ముంగిటకే సేవలు తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మేకపాటి రాజగోపాల్‌రెడ్డి చెప్పారు. లక్ష్మీపురంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని హెల్త్ క్లినిక్ సెంటరు, రైతుభరోసా కేంద్రాల వల్ల ప్రతి ఒక్కరికీ ఎంతో లబ్ధిచేకూరుతుందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలతో ప్రజలు మెరుగైన వైద్య సౌకర్యాలు పొందుతున్నారన్నారు. రైతులు తాము పండించిన పంటలను గిట్టుబాటు ధరలకు అమ్ముకోవడానికి వ్యవసాయంలో మెళకువలు తెలుసుకోవడానికి రైతు భరోసా కేంద్రాలు ఎంతో దోహదపడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు కాటం రవీంద్రారెడ్డి, సర్పంచ్ దాసరి కొండమ్మ, ఉప సర్పంచ్ కందుల వెంకట రమణమ్మ, పీఏసీఎస్ చైర్మన్ దగుమాటి ఆదిశేషారెడ్డి, స్థానిక నాయకులు మల్లారు యాదిరెడ్డి, కోట మహేశ్వరరెడ్డి, కందుల మహేష్, గుమ్మ రాజయ్య, కోటంరెడ్డి సుజాతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న భావితరాలకు భవిష్యత్

- సంక్షేమానికి, అభివృద్ధికి కొత్త నిర్వచనం
- ప్రపంచంతో పోటీ పడేలా విద్యాబోధన
- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే మేకపాటి



విజయీభవయాత్రలో ప్రజలకు ఫ్యాన్ గుర్తు చూపిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

అనుమసముద్రంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావితరాలకు భవిష్యత్ అని, దేశ స్థాయిలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా అనేక సంక్షేమ పథకాలకు రూపకల్పన చేసి అమలు చేసిన సంక్షేమకర్త అని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పొనుగోడు, దూబగుంట గ్రామాల్లో విజయీభవయాత్ర నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలకు ప్రస్తుతం అధికారంలో ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ఉన్న తేడాను వివరించడంతో పాటు రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లను వేసి గెలిపించాలని కోరారు. ప్రతి గ్రామాన్ని సంక్షేమాభివృద్ధి దిశగా నడిపేందుకు కోట్లాది రూపాయలు అందశారన్నారు. పొనుగోడు పంచాయతీకి రూ.6.43 కోట్లు, దూబగుంట గ్రామానికి రూ.7.3 కోట్లు అందజేయడం జరిగిందని అన్నారు. విద్యా వ్యవస్థలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సంస్కరణల కారణంగా దేశం మొత్తం మన రాష్ట్రం వైపు చూస్తుందన్నారు. ప్రపంచంతో పోటీ పడేలా విద్యా బోధనకు ఐబీతో ఒప్పందం కుదుర్చుకుని రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈ గ్రామాల్లో 54 మంది చిన్నారులకు ట్యాబ్‌లు సైతం అందజేశారన్నారు.

డ్వాక్రా రుణమాఫీతో మోసం చేసిన ఘనుడు చంద్రబాబు

2014లో డ్వాక్రా రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి మోసం చేసిన ఘనుడు చంద్రబాబు అని గుర్తు చేశారు. మళ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజలకు కల్లబొల్లి మాటలు చెబుతూ ప్రజల వద్దకు వస్తున్నారని, అలాంటి వారికి ప్రజలంతా బుద్ధి చెప్పాలన్నారు.

రైతు సంక్షేమ ప్రభుత్వం

రైతాంగం అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంస్కరణలను తీసుకొచ్చిందన్నారు. ఏఎస్‌పేట మండలంలో ప్రతి చెరువుకు సాగునీటిని అందించేందుకు ప్రజాప్రతినిధులతో మాట్లాడి సాగునీటిని అందజేసి ప్రతి రైతు కళ్లల్లో ఆనందాన్ని నింపామన్నారు. చుక్కల భూముల సమస్య పరిష్కారం కావడంతో రాష్ట్రంలో 3 లక్షల మంది రైతుల సమస్యలను పరిష్కరించిన ఘనత వైఎస్సార్‌సీపీదేనన్నారు. రెవెన్యూ వ్యవస్థలో సంస్కరణల ఫలితంగా పొనుగోడులో 105, దూబగుంటలో 90 మంది రైతుల సమస్యలు పరిష్కారమయ్యాయని వివరించారు. అనంతరం దూబగుంట గ్రామంలో సీసీరోడ్లు, సైడ్ డ్రైన్ల నిర్మాణాలు పూర్తి కావడంతో వాటిని ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పందిళ్లపల్లి సుబ్బారెడ్డి, ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి, జెడ్పీటీసీ పందిళ్లపల్లి రాజేశ్వరమ్మ, రాజవోలు సొసైటీ చైర్మన్ కల్లూరు ప్రభాకర్‌రెడ్డి, మాజీ చైర్మన్ కాటంరెడ్డి నారసింహారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పులిమి రమేష్‌రెడ్డి, నాయకులు సీహెచ్ బ్రహ్మారెడ్డి, గోవింద రెడ్డి, రవికుమార్‌రెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ సంధాని తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే విజయీభవ యాత్ర

సంగం: మండలంలోని ఉడ్‌హౌస్‌పేటలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గురువారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి విజయీభవయాత్ర నిర్వహిస్తారని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సంగంలో దాదాపు రూ.కోటితో నిర్మించిన వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు చేస్తారు. అనంతరం ఉడ్‌హౌస్‌పేటలో సర్పంచ్ ఆర్.బాలానాయుడు దాతృత్వంతో ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం నేతృత్వంలో రూ.4 లక్షలతో ఏర్పాటు చేసిన వీధిలైట్లను ప్రారంభిస్తారు. సాయంత్రం 5 గంటలకు చెన్నవరప్పాడు, 6 గంటలకు తరుణవాయి గ్రామాల్లో విజయీభవయాత్రలను నిర్వహిస్తారు.

బైక్‌తో ఢీకొట్టి రూ.2 లక్షల దారి దోపిడీ

అనుమసముద్రంపేట: మండలంలోని రాజవోలు అటవీ ప్రాంతంలో బుధవారం రాత్రి దారి దోపిడీ ఘటన జరిగింది. ఎస్సై ప్రసాద్‌రెడ్డి సమాచారం మేరకు.. ఆత్మకూరు మండలం కనుపూరుపల్లికి చెందిన పెంచలయ్య ఆత్మకూరులోని ముత్తూట్ ఫిన్ కార్ప్‌లో కలెక్షన్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నాడు. కలిగిరి ప్రాంతంలో లోన్లకు సంబంధించి నగదు వసూలు చేసుకుని తిరిగి వస్తుండగా చౌటభీమవరం-రాజవోలు మధ్య అటవీ ప్రాంతంలో ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌తో పెంచలయ్య వాహనాన్ని ఢీకొట్టారు. పెంచలయ్య కింద పడిన వెంటనే అతని వద్ద ఉన్న రూ.2 లక్షలు నగదు బ్యాగ్‌ను లాక్కొని పరారీ అయ్యారు. సమాచారం అందుకున్న ఏఎస్‌పేట ఎస్సై ప్రసాద్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకుని బాధితుడి వద్ద వివరాలు సేకరించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జాతి భేదాన్ని మరిచి..



ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరులో కంచర్ల వెంకట సుబ్బయ్య నివాసంలో గొర్రెపిల్లకు జాతిభేదం మరిచి ఓ సునకం తన పాలు ఇస్తూ ఆశ్చర్యపరిచింది. గ్రామంలో ఈ ఘటన ఆ నోటా, ఈనోటా అందరికీ తెలియడంతో విశేషంగా చెప్పుకుంటున్నారు.